ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్
STATE VISION

శనివారం 29-08-2026 పేజీలు : 16



## రాఖీ కట్టి..అనుబంధాన్ని చూపించి

మందమర్రి, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర) : సింగరేణి జిఎం కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు జనరల్ మేనేజర్ రాధాకృష్ణకు రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చూపించారు. శుక్రవారం రాఖీ పండుగ సందర్భంగా జిఎంకు రాఖీ కట్టటం పట్ల మహిళా ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింగరేణి గనులు, డిపార్ట్మెంట్లలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల సంక్షేమానికి,భద్రతకు ఎల్లప్పుడు తోడుగా ఉంటానని జిఎం పేర్కొన్నారు.

# మహిళపై అత్యాచారం కేసులో
# ఇద్దరు నిందితులు అరెస్ట్
## - రిమాండ్‌కు తరలింపు: డీఎస్పీ మహేష్



మక్తల్ ఆగస్టు 28 విజన్ ఆంధ్ర : మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 53 ఏళ్ల మహిళపై జరిగిన అత్యాచారం కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు.

ఈ ఘటనపై మక్తల్ పోలీస్ స్టేషన్లో డిఎస్పి మహేష్ పత్రిక సమావేశం ఏర్పాటు చేసి నిందితుని వివరాలు వెల్లడించారు. మహిళపై జరిగిన అత్యాచారం కేసులో మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ ఐ ఆర్ నెం .342/2026, సెక్షన్ 70(1) బి ఎన్ ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి బాధితురాలిని రక్షించి మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. మహిళా ఎస్ఐ బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐ పి ఎస్ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులైన వారు మక్తల్ చెందిన బోయ అరవింద్ (19), బోయ విజయ్ (19) లను అరెస్ట్ చేసి, కేసుకు సంబంధించిన తదుపరి చట్టపరమైన ప్రక్రియలో భాగంగా రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. కేసును త్వరగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన మక్తల్ సీఐ రామ్లాల్, ఎస్సై రాజుతో పాటు పోలీస్ సిబ్బందిని డీఎస్పీ మహేష్ అభినందించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ... మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళల భద్రతకు నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. బాధితురాలికి అవసరమైన పోలీసు సహాయం అందిస్తామని పేర్కొన్నారు. కేసులో తదుపరి దర్యాప్తు మరియు చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని డీఎస్పీ తెలిపారు.



## మంత్రి వాకిటి శ్రీహరికి రాఖీ కట్టిన మంత్రి ధనసరి సీతక్క

మక్తల్ ఆగస్టు 28 విజన్ ఆంధ్ర : మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి వాకిటి శ్రీహరి నివాసంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క మంత్రి వాకిటి శ్రీహరికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సీతక్కతో పాటు ఇందిరా శోభన్, సంధ్యారెడ్డి కూడా మంత్రి వాకిటి శ్రీహరికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి రాఖీ కట్టిన సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ మంత్రి హరీష్ రావుకు రాఖీ కట్టిన కోల సద్గుణ..

కుకునూరుపల్లి, ఆగష్టు 28,విజన్ ఆంధ్ర : శుక్రవారం రాఖీ పండుగ సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు ఎన్ఆర్ఈజిఎస్ స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యురాలు కోల సద్గుణ రాఖీ కట్టారు. అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ వేడుకల్లో భాగంగా హైదరాబాద్ లో ఆయన నివాసంలో రాఖీ కట్టి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరీష్ రావుకు రాఖీ కట్టడం ఎంతో సంతోషంగా ఉందని, ఆయనతో తమకు ఎంతో ఆత్మీయమైన అనుబంధం ఉందని కోల సద్గుణ పేర్కొన్నారు. హరీష్ రావు ఎల్లప్పుడూ ప్రజల కోసం పనిచేస్తూ, ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. రాఖీ పండుగ సందర్భంగా హరీష్ రావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు.



అన్నా చెల్లెళ్ళ మధ్య ప్రేమ, ఆప్యాయత ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.



## రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు
### - మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్ ఆగష్టు 28 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అన్నా చెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతకు ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుందన్నారు.పరస్పర గౌరవం, ఆప్యాయత,రక్షణ, అండగా నిలిచే స్పూర్తి, కుటుంబ జీవనం లో ప్రత్యేక సాంప్రదాయ, సంస్కృతిక వేడుకకు ఈ పండుగ ప్రతి రూపమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు.

# జామా మజీద్‌లో ఘనంగా మిలాద్-ఉన్-నబి

## మజీద్ కమిటీ ఆధ్వర్యంలో 600 మందికి అన్నదాన కార్యక్రమం

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 28 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని స్థానిక జమా మజీద్ లో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా మిలాద్-ఉన్-నబీ ఘనంగా నిర్వహించారు. శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మత పెద్దలు మాట్లాడుతూ అందరి దేవుడు ఒక్కడే అని నినదించారు. మానవులంతా ఒక్కటే అని చాటి చెప్పారు. మహ్మద్ ప్రవక్త మనిషి పుట్టుకరీత్యా, వంశం, ఆస్తి దృష్ట్యా గొప్పవాడు కాలేరని దైవభీతి పరాయణ దృష్ట్యానే గొప్పవాడని చెప్పారు. బానిసత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారని, మూఢనమ్మకాలను పారద్రోలారన్నారు. తల్లి పాదాల కింద స్వర్గముందని చెప్పి మాతృమూర్తి,ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటారని, కూలీవాని చెమట బిందువులు, ఆరకముందే కూలీ చెల్లించాలని కష్టజీవులకు అండగా నిలిచారన్నారు.నలభై ఏళ్ల వయస్సులో హిరా గుహలో దైవవాణి పొంది ప్రపంచానికి వెలుగులు పంచారన్నారు.



ఆయనే ఆ మహనీయుడే ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ఆయన చేసిన త్యాగాలు,అనుపమానమైనవి. బలహీనుల ఆశాజ్యోతిగా, మహిళలకు అండగా, గొప్ప సామాజిక సంస్కర్తగా ప్రవక్త అన్నారు.ముహమ్మద్ జీవితం ప్రపంచ ముస్లిములకే కాదు మానవకోటికి మార్గదర్శకం. నేడు మానవాళి అని ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ముహమ్మద్ ప్రవక్త (సఅసం) ప్రబోధనలు పరిష్కారం చూపిస్తాయన్నారు.ప్రవక్త పుట్టిన రోజు( మిలాద్-ఉన్-నబీ )ను పురస్కరించుకొని జామా మసీదులో ఫాతేహా నిర్వహించి 600 ల మందికి దావత్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండి భాషుమియా,కమిటీ ప్రధాన కార్యదర్శి,ఎండి హసన్ , వర్కింగ్ కార్యదర్శి, ఎండి అయూబ్ ,రూహుల్ ఆమిన్ఎండి ఫసీ, ఎండి షబీర్, ఎండి తాజ్ పాషా, ఎండి అఫ్జల్ రిటైర్డ్ కండక్టర్, ఎండి అక్బర్, సయ్యద్ పాష, ఎండి అబ్జల్ పాష, ఎండి ముంతాజ్, యండి అంజద్,ఎండి అప్సర్, ఎండి యాకుబ్, ఎం డి యనుస్, కె ఆతిక్, ఎండి ఈసా, రఫీ, పాషా, ఫయాజ్, ఆరిఫ్, సయ్యద్ యూసుఫ్, ఎండి ఖాసీం, మొహమ్మద్ సుజాహిద్ పాషా, సయ్యద్ ఇంతియాజ్,ఆజీం, ఎండి అల్తాఫ్, ఎండి మాహిర్ పాషా, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసం అంకాపూర్ లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు..



ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్ట్ 28 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ డివిజన్ లోని అంకాపూర్ గ్రామంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోదరీమణులు మాధురి. శ్వేత ఆయనకు రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ తన కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన సోదరీమణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఆర్మూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రతి అక్క చెల్లెమ్మలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను సమాజంలో ప్రతి మహిళకు రక్షణగా నిలబడడమే రక్షాబంధన్ యొక్క అసలైన అంతరార్థం ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు స్థానిక ముఖ్య నాయకులు పాల్గొన్నారు ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు మరియు ప్రతి ఒక్కరికి సోదరీమణులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలిపారు.

## కృష్ణ నగర్ సంజీవిని హనుమాన్ మందిరంలో యజ్ఞోపవితశీ

సదాశివపేట : విజన్ ఆంధ్ర : రక్షాబంధన్ సందర్భంగా సదాశివపేట శ్రీకృష్ణ నగర్ కాలనీలోని సంజీవిని హనుమాన్ మందిర్లో కృష్ణ నగర్ కాలనీ పద్మశాలి కుల బాంధవుల సంఘం ఆధ్వర్యంలో ఆలయ పూజారి చంద్రశేఖర్ పాల్గొని యజ్ఞోపవితం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు కనకరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాగే కృష్ణానగర్ పద్మశాలి కుల బాంధవులు యజ్ఞోపవిత కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించి, అనంతరం జంజిరాలు మార్చుకొని విజయవంతం చేయాలన్నారు .

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వొగ్గు గణేష్ ,

కోశాధికారి రుద్ర నరసింహులు, పద్మశాలి రవి , ఎర్వ సాయిలు, రుద్ర లక్ష్మణ్ , సాలె రాజు, పోలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూర్‌లో ఘనంగా పద్మశాలి బాణాల ఊరేగింపు

### - రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక వేడుకలు

చౌటకూర్ ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర) :- చౌటకూర్ మండల కేంద్రంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బాణాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సమాజంలో పూర్వీకుల కాలం నుంచి వస్తున్న సంప్రదాయంలో భాగంగా బాణాలను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం బాణాలతో గ్రామ ప్రధాన వీధుల గుండా ఘనంగా ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. బాణాలు శక్తి, ధైర్యం, సమాజ రక్షణకు ప్రతీకలని తెలిపారు. పూర్వకాలంలో రక్షణతో ముడిపడిన ఈ వీరత్వ సంప్రదాయం, కాలక్రమేణా సాంస్కృతిక వారసత్వంగా మారిందని పేర్కొన్నారు. తమ సమాజ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ ఊరేగింపుతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం



నెలకొంది. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు కంజర్ల నాగయ్య, అతినారం పెంటయ్య, ప్యాట గంగారం, వర్కల రమేష్, వొన్నపురం సాయి, ప్యాట నాగేష్, కంజర్ల యాదయ్య, అంచ రమేష్, వెంకటేష్, రవీందర్‌లతో పాటు స్థానిక యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలమూరు జిల్లా వ్యాప్తంగా అన్నాచెల్లెళ్ల అనుబంధాల అద్భుత వేడుక

**- ఘనంగా రాఖీ పండుగ సంబరాలు!**

**- ఎమ్మెల్యేలకు, అధికారులకు రాఖీలు కట్టిన సోదరీమణులు -**

**- కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డికి యశోదమ్మ, రామేశ్వరమ్మల రాఖీ -**

**- వయసుతో సంబంధం లేకుండా వెల్లివిరిసిన ఆప్యాయతలు...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 28: అన్నా చెల్లెలి, అక్కా తమ్ముడి పవిత్ర అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా అత్యంత ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. జిల్లాలోని ప్రతి ఇంటా సోదరీ సోదరుల మధ్య ప్రేమానురాగాలు వెల్లివిరిశాయి.

ఈ పవిత్రమైన రోజున సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, వారి దీర్ఘాయుష్షు, సుఖసంతోషాల కోసం ప్రార్థించారు. తమ అక్కాచెల్లెళ్లను జీవితాంతం కంటికి రెప్పలా కాపాడుకుంటామని సోదరులు మాట ఇచ్చారు.

జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు వారి అక్కాచెల్లెళ్లు, మహిళా కార్యకర్తలు, చిన్నారులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు రాఖీ శుభాకాంక్షలతో సందడిగా మారాయి.



కల్వకుర్తిలో ప్రత్యేక సందడి:

రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి పట్టణం ఆత్మీయ అనుబంధాలతో మరింత కళకళలాడింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన సోదరీమణులు యశోదమ్మ, రామేశ్వరమ్మలు ఆప్యాయంగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నియోజకవర్గంలోని సోదరీమణులందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. సోదరీమణుల రక్షణ, సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

కల్వకుర్తి పట్టణంలో కూడా అన్నా చెల్లి, అక్కా తమ్ముడి ఆప్యాయతల మధ్య వేడుక ఘనంగా జరిగింది. వయస్సుతో పరిమితం లేకుండా చిన్నారుల నుండి పెద్దల వరకు అందరూ అనుబంధాలను చాటుకుంటూ, ఒకరికొకరు రాఖీలు కట్టుకుని, మిఠాయిలు పంచుకున్నారు.

రాఖీ అనేది కేవలం దారం కాదు, అది జీవితాంతం తోడుంటాననే భరోసా, ప్రేమకు ప్రతీక అని చాటుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా, ముఖ్యంగా కల్వకుర్తిలో పండుగ వాతావరణం నెలకొంది.

## తెలంగాణ రైతు సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక..

**- అధ్యక్ష, కార్యదర్శులుగా కందాల రమేష్,తాడూరి వీరేంకులు**

మరిపెడ , విజన్ ఆంధ్ర : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బురహన్ పూరం గ్రామంలో జరిగిన తెలంగాణ రైతు సంఘం ఐదో మహాసభలలో అధ్యక్ష కార్యదర్శులను ప్రకటించడం జరిగిందని( ఏ ఎల్ కె ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్టి వెంకన్న ప్రకటించారు,ఈ కమిటీలో భాగంగా సహాయ కార్యదర్శిగా తాటికొండ అనంత చారి,నలబోలు లక్ష్మారెడ్డి,మండల ఉపాధ్యక్షులుగా అల్లి శ్రీనివాస్ రెడ్డి బోడపట్ల రాజశేఖర్,గుడిసె తీరుమల్,కమిటీ సభ్యులుగా చెన్నబోయిన వెంకన్న,జినుక రామ్మూర్తి, సీత వెంకన్న,మొగిలి యాకన్న సభ్యులుగా ఎన్నికయ్యారు అని తెలిపారు, మొత్తంగా 13 మంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకోవడం జరిగింది,

## శిశుమందిర్ లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

పెద్ద శంకరంపేట్: ఆగస్టు 28: విజన్ ఆంధ్ర: పెద్ద శంకరంపేట్.. పెద్ద శంకరంపేట లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పెద్ద శంకరంపేట తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ప్రజలు రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమి విశిష్టతను ప్రధానాచార్యులు లక్ష్మీనారాయణ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు. ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు ఒకరికి ఒకరు రాఖీ పౌర్ణమి శ్లోకాన్ని పఠిస్తూ రాఖీలను కట్టుకున్నారు. . ఈ కార్యక్రమంలో శిశు మందిర్ అధ్యక్షులు . దాదిగారి గంగాధర్. ఉపాధ్యక్షులు జంగం రాఘవులు. ప్రబంధకారిని ఆర్ఎస్ఎస్ బాధ్యులు జైహింద్ రెడ్డి సీతారామారావు సతీష్ గౌడ్ బి వీరప్ప. రవి వర్మ ఆనంద్. శ్రీనివాస్. విశ్వేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పి వి ఆర్ భవన్ లో వినయ్ కుమార్ రెడ్డిని కలిసిన ఆర్మూర్ మేర సంఘ జిల్లా నాయకులు..

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్ట్ 28 ( విజన్ ఆంధ్ర) ఆర్మూర్ నియోజకవర్గ లో మేరు కులస్తులకు సంబంధించిన పలు సమస్యలపై ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డిని గారిని కలిసి విన్నవించి వినతి పత్రం ఇచ్చి ఆ సమస్యలపై చర్చించిన జిల్లా మేరు సంఘం ఉపాధ్యక్షులు కొట్టూరు చంద్రకాంత్ గారు ఆర్మూర్ పట్టణ మేరు సంగం నాయకులు కొట్టు రూ ప్రవీణ్ రాజు గారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళల కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో మేరు కులస్తులు ఎక్కువగా కుట్టు మిషన్లపై జీవనాధారం సాగిస్తున్న సందర్భంగా మేరు కులస్తులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని విన్నవించడంతోపాటు ఆర్మూర్ నియోజకవర్గముకు సంబంధించిన మేరు కుల సంఘం భవన స్థలం మరియు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించిన జిల్లా మీరు సంఘం నాయకులు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి గారిని శాలువాతో ఘనంగా సత్కరించిన మేరు సంఘ కుల నాయకులు. ఈ కార్యక్రమంలో



వారితోపాటు నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి గారు ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ గారు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగరాజు గౌడ్ గారు డిసిసి సెక్రెటరీ సాయినాథ్ గౌడ్ గారు కౌన్సిలర్లు నవీన్ గారు బొప్పెన ప్రసాద్ గారు మరియు ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యమ అమరవీరులకు సీపీఎం ఘన నివాళి

బెల్లంపల్లి ఆగస్ట్ 28 విజన్ ఆంధ్ర : బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని సీపీఎం తాండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ భవన్‌లో సంస్మరణ సభ నిర్వహించారు. అమరవీరులు బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ నుంచి కాపాడేందుకు బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న విద్యుత్ సవరణ చట్టంతో విద్యుత్ చార్జీలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కొమ్మకేత, దుర్గం నాన్నయ్య, జైనేని రాజయ్య, కే.రాజయ్య, చింతపురి లక్ష్మణ్, ధర్మరాజుల వెంకటేశం, రవీందర్, కామెరా బాపు, షబీర్, లక్ష్మయ్య, ఉద్నాల చందు, చంద్రగిరి తిరుపతి, మడిపెల్లి చందు, తమ్ముల వేణి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# అధిక ధరలతో కొండెక్కి కూర్చున్న నిత్యవసరాల ధరలు

- అధికారుల నిర్లక్ష్యంతో నియంత్రణ లేని నిత్యావసరాల ధరలు
- 20 నుండి 30 శాతం ధరల పెరుగుదలతో జనం పరేషాన్
- చక్కెర చేదయింది, ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తుంది, మంచినీళ్ల నూనెలు ధరలు దిగనంటున్నాయి
- నిత్యవసరాల ధరలపై విజన్ ఆంధ్ర ప్రత్యేక కథనం

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 28 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంతంలో నిత్యవసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో సామాన్య జనం, మధ్యతరగతి పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ధరల పెరుగుదలతో దీనికి తోడు చాలీచాలని జీతాలు ఉండడం,ప్రభుత్వాలు నిత్యవసరలలను కట్టడి చేయలేకపోవడంతో పేద కుటుంబాలు లబోదిబోమంటూ బెంబేలెత్తిపోతున్నారు. కూరగాయలు పప్పులు వంట నూనెలు చక్కర ఉల్లి వంటి నిత్యవసరాల ధరలు పెరుగుదలతో నిరుపేద కుటుంబాల నెలవారి బడ్జెట్ తారుమారవుతుంది. గతంలో ఖర్చు చేసిన మొత్తంలో ప్రస్తుతం అదే స్థాయిలో సరుకులు కొనలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మార్కెట్ కు వెళ్లిన ప్రతిసారి గతం కంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని దీంతో పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యవసర, కూరగాయల పాల ధరల పెరుగుదలతో ప్రజలు చుక్కలు చూస్తున్నారు.అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కృత్రిమకొరత సృష్టించడం అధిక ధరలకు విక్రయించడం వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పెద్ద ఎత్తున కోరుతున్నారు.

**చక్కెర ధర చేదయింది,ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తుంది**

ప్రస్తుతం మార్కెట్లో చక్కెర 20 రోజుల కింద 40నుండి 45 రూపాలు ఉన్న చక్కర ధరలు ఇప్పుడు 65 నుండి 70 రూపాయలకు ఎగబాకింది. దీంతో పేద ప్రజలకు చక్కెర తీపి కన్నా చేదువైపోయిందని వాపోతున్నారు. ఉల్లి ధర 20 నుంచి 30 రూపాయలు ఉండవలసిన దానికంటే 60 నుంచి 70 రూపాయలకు పెరగడంతో పేద కుటుంబాల ప్రజలలో ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తుందని ఉలిక్కి పడుతున్నారు. మంచినూనె ధరలు 150 రూపాయలు ఉన్న ధరలు 180 నుంచి 190 రూపాయలకు పెరిగినాయి. అల్లం ఎల్లిగడ్డ, పప్పులు లాంటి ప్రతి నిత్యవసర వస్తువులు ఈ 20 రోజులలో 20నుండి 30% ధరలు పెరిగినాయి.కూరగాయలు ఏది కొనాలన్న వంద నుంచి ఆపైన ధర పలుకుతున్నది. సామాన్య ప్రజల చేసిన రోజువారి కష్టం నిత్యవసరాల ధరలకే సరిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధిక ధరలపై అధికారులు పర్యవేక్షణ చేయాలి**

నిత్యవసరాల ధరలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రభుత్వం అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలో నిత్యవసర వస్తువులు ఎంతవరకు అవసరం ఉంటాయి. కృత్రిమ కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు గోదాములు దుకాణాలలో తనిఖీలు నిర్వహించాలని, ధరలను నియంత్రించాలని సామాన్య ప్రజలకు ధరలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు పెద్దఎత్తున కోరుతున్నారు.



## ఆర్మూర్ లోని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో రాఖీ పండుగ సందర్భంగా అన్నప్రసాద వితరణ

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్టు 28 ( విజన్ ఆంధ్ర) ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో రాఖీ పండగ సందర్భంగా మహా అన్న ప్రసాదం కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు ముదిరాజ్ సంఘం పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పౌర్ణమి నాడు భక్తులకు అన్నప్రసాదం వితరణ చేయడం ఆనవాయితీగా వస్తుంది ఈ కార్యక్రమం 8 నెలలుగా అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుంది అని అన్నారు.

దాతలు. జిన్నా సుమన్. అపూర్వ దంపతులు వారి ఆర్థిక సహకారంతో ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ కమిటీ సభ్యులు . మహా అన్న ప్రసాదాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ పెద్ద బజార్ అధ్యక్షులు బోండ్ల పెద్దులు ఆలయ అధ్యక్షులు గజం మచ్చేందర్ ప్రముఖులు వేముల భోజన్న. జక్కం భూమన్న. బోండ్ల గోపి. జక్కం శేఖర్. జంగిల్ శ్రీనివాస్ నడిపి భోజన్న సైదు రమేష్ మరియు భక్తులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తమ్ముడు సీఐ కిషన్‌కు రాఖీ కట్టిన కౌన్సిలర్ వసంత

బెల్లంపల్లి ఆగస్ట్ 28 విజన్ ఆంధ్ర : రాఖీ పౌర్ణమి సందర్భంగా బెల్లంపల్లి పట్టణ 15వ వార్డు కౌన్సిలర్ చింతల వసంత ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మడికొండ సీఐగా విధులు నిర్వహిస్తున్న తన తమ్ముడు పుల్యాల కిషన్‌కు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయి తినిపించి సోదరిపై తనకున్న ఆప్యాయతను చాటుకున్నారు. సీఐ పుల్యాల కిషన్ తన అక్క వసంత ఆశీర్వచనాలు తీసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, పరస్పర నమ్మకానికి రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందని కౌన్సిలర్ వసంత పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రాఖీ పండుగను ఆనందంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

## సిర్గాపూర్‌లో డిజిటల్ పంట సర్వే పరిశీలన

సిర్గాపూర్ మండలంలో చేపడుతున్న డిజిటల్ పంట సర్వే ప్రక్రియను నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్ కుమార్, సిర్గాపూర్ మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల వివరాల నమోదు, సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రైతుల పంట వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు.



# రాఖీ పౌర్ణమి వేడుకల్లో వెల్లివిరిసిన అన్నాచెల్లెళ్ల ఆప్యాయత

**- అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ సంబరాలు**



చౌటకూర్, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర ) : రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు వెల్లివిరిశాయి. పవిత్రమైన రాఖీ పండుగ సందర్భంగా ఆడపడుచులు తమ సోదరులకు ప్రేమతో రాఖీలు కట్టి, వారి క్షేమం, ఆయురారోగ్యాలను ఆకాంక్షించారు. సంప్రదాయబద్ధంగా హారతులు ఇచ్చి, రాఖీలు కట్టిన అనంతరం మిఠాయిలు తినిపించి తమ ప్రేమను చాటుకున్నారు. అన్నదమ్ములు సైతం సోదరీమణులకు కానుకలు అందజేసి, జీవితాంతం వారికి రక్షణగా, అండగా ఉంటామని భరోసానిచ్చారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కుటుంబ సభ్యులంతా ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు మాట్లాడుతూ.. తమ అనుబంధం కలకాలం ఇలాగే కొనసాగాలని, సోదరుల జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యుల కలయికతో పల్లెలు, మండల పరిధిలోని ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది. అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ సంబరాలు

# సీసీ కెమెరాల సాయంతో బంగారం గుర్తింపు



చౌటకూర్, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర):- ఆటోలో ప్రయాణిస్తుండగా పోగొట్టుకున్న బంగారు నగలు, నగదు, మొబైల్ ఫోన్‌ను సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించారు. పుల్కల్ మండలం పరిధిలోని గొంగ్లూరు గిరిజన తండాకు చెందిన పోస్టుమాన్ రమావత్ అమర్‌సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఆటోలో ప్రయాణిస్తుండగా, సుమారు 15 తులాల బంగారు నగలు, రూ. 15 వేల నగదు, మొబైల్ ఫోన్ ఉన్న బ్యాగు రోడ్డుపై పడిపోయింది. విషయం గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గంగోజిపేట, తాడ్దానిపల్లి పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఫుటేజీ ఆధారంగా ఇపోజిపేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు బంగారు నగలు దొరికినట్లు గుర్తించి వారిని సంప్రదించారు. వారి వద్ద నుంచి పోయిన బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అనంతరం ఎస్సై నల్లా విశ్వజన్ బాధితుడు అమర్‌సింగ్‌కు బంగారు నగలను అప్పగించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై విశ్వజన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సర్పంచ్‌లను కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలను నియంత్రించడంతో పాటు, తప్పిపోయిన వస్తువులు, వ్యక్తుల ఆచూకీని గుర్తించడంలో కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

# రక్షా దారంలో అనురాగం.. దేశ ధర్మానికి అంకితం

**- రాఖీ కడితే బంధం.. మనసులు కలిస్తే అనుబంధం**

**- నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష.. సమాజానికి మనమే రక్ష**

**- అన్నాచెల్లెళ్ల ఆత్మీయత.. సోదరభావం, దేశభక్తికి ప్రతీక రక్షాబంధన్**

చేవెళ్ల, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): "యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః తేన త్వామపి బధ్నామి రక్షే మా చల మా చల" రక్షాబంధన్.. రక్షణకు, ప్రేమకు, అనుబంధానికి ప్రతీక. రాఖీ అనే చిన్న దారంలో పెద్ద బంధాన్ని ముడివేసే పర్వదినం. అక్క తమ్ముడికి.. చెల్లెలు అన్నకు రాఖీ కట్టి ఆప్యాయతను చాటుకుంటారు. అయితే రక్షాబంధన్ కేవలం రక్తసంబంధాలకే పరిమితం కాదు. సోదరభావంతో ఒకరికొకరు రాఖీ కట్టుకుని ఆత్మీయతను పంచుకుంటారు. "నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష.. మనిద్దరం కలిసి సమాజానికి రక్ష" అనే భావనను చాటుతారు. ఒక్క దారం చేతికి చేరుతుంది.. కానీ ఎన్నో హృదయాలను కలుపుతుంది. రాఖీ కట్టిన చేతిలో ప్రేమ ఉంటుంది.. రాఖీ కట్టించుకున్న మనసులో బాధ్యత ఉంటుంది. ఒకరి కష్టంలో మరొకరు తోడుగా నిలవాలనే నమ్మకాన్ని ఈ పండుగ గుర్తుచేస్తుంది. దేశం, ధర్మం, సమాజం కోసం కలిసి నిలబడాలనే స్ఫూర్తిని నింపుతుంది. కులమతాలకు అతీతంగా సోదరభావాన్ని చాటుతూ.. మానవత్వం, ఐక్యతకు ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు. పురాణ కథల్లోనూ రక్షకు ప్రత్యేక స్థానం కనిపిస్తుంది. శ్రీకృష్ణుడికి ద్రౌపది చూపిన ఆప్యాయతను రక్షాబంధన్ భావనతో అనుసంధానిస్తారు. ఇంద్రుడికి శచీదేవి రక్ష కట్టిన కథ కూడా ప్రసిద్ధి చెందింది. బలిచక్రవర్తికి లక్ష్మీదేవి రక్ష కట్టిన కథను కూడా ఈ పర్వదినంతో అనుసంధానిస్తారు. అందుకే రాఖీ అంటే కేవలం దారం కాదు.. ప్రేమకు ముడి.. నమ్మకానికి నుడి.. రక్షణకు ప్రతీక. దేశవ్యాప్తంగా రక్షాబంధన్‌ను వివిధ సంప్రదాయాలతో ఘనంగా జరుపుకుంటారు. ఇళ్లలో రాఖీలు కట్టి.. తిలకం పెట్టి.. మిఠాయిలు తినిపిస్తూ ఆనందాన్ని పంచుకుంటారు. అన్నాచెల్లెళ్లు బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటూ అనుబంధాన్ని మరింత బలపరుచుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో ఈ రోజును ప్రత్యేక ఆచారాలతో, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిర్వహిస్తారు. కాలం మారినా.. పద్ధతులు మారినా.. రాఖీ పండుగలోని ప్రేమ మాత్రం మారదు. చేతికి కట్టే దారం చిన్నదైనా.. దాని వెనుక ఉన్న భావం ఎంతో గొప్పది. బంధం బలపడాలి.. అనుబంధం పెరగాలి.. సమాజంలో సోదరభావం వెల్లివిరియాలి. దేశం కోసం.. ధర్మం కోసం.. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలి. రక్షాబంధన్ మనలో ప్రేమను పెంచుతూ.. ఐక్యతను చాటుతూ.. మానవత్వాన్ని మేల్కొలుపుతుంది. ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఇంటా ఆనందాన్ని, ప్రతి హృదయంలో ఆప్యాయతను నింపాలని కోరుకుందాం. ప్రేమ పంచుకుందాం.. రక్షగా నిలుద్దాం.. దేశ ధర్మాల కోసం కలిసి నడుద్దాం.

రక్షాబంధన్ శుభాకాంక్షలతో..

– సామాజిక కార్యకర్త, అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి (చేవెళ్ళ) సెల్: 9866169862.



# ప్రపంచ శాంతి కోసం 50 రోజుల ఉపవాస ప్రార్థనలు

## పావురాలను ఎగురవేసి ప్రారంభించిన పాస్టర్ ప్రవీణ్

బెల్లంపల్లి ఆగస్టు 28 విజన్ ఆంధ్ర : ప్రపంచ శాంతి, సుభిక్షం కోసం ఏటా 50 రోజుల ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు కల్వరి మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ ఆర్. ప్రవీణ్ తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని సోమగూడెం కల్వరి మినిస్ట్రీస్ చర్చిలో గురువారం 50 రోజుల ఉపవాస ప్రార్థనలను పావురాలను ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ ప్రార్థనలు ప్రపంచ శాంతికి, ప్రజల సుభిక్షానికి దోహదపడాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థనలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలో శాంతి నెలకొనేలా ప్రతి ఒక్కరూ ప్రార్థనల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రార్థనల ప్రారంభోత్సవానికి దేశ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 10 వేల మంది క్రైస్తవులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో చర్చి ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. కార్యక్రమంలో సిస్టర్ షారోన్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## అన్న రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్‌కు రాఖీ కట్టిన కౌన్సిలర్ వసంత

బెల్లంపల్లి ఆగస్టు 28 విజన్ ఆంధ్ర : రాఖీ పౌర్ణమి సందర్భంగా బెల్లంపల్లి 15వ వార్డు కౌన్సిలర్ చింతల వసంత తన అన్న, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్‌కు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయి తినిపించి ఆత్మీయతను చాటుకున్నారు. రవికుమార్ తన చెల్లెలు వసంతను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, అనుబంధానికి రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందని కౌన్సిలర్ వసంత పేర్కొన్నారు. చిన్ననాటి నుంచి కొనసాగుతున్న అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ రాఖీ పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

# కార్మికుల సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి..

చేవెళ్ల, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర) : కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి, జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. చేవెళ్ల మండల కేంద్రంలోని లేబర్ అడ్డ వద్ద కరీంనగర్‌లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి, భవిష్యత్ కార్మిక ఉద్యమానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. రంగారెడ్డి జిల్లాలోనూ అసంఘటిత రంగ కార్మికులు, ఇతర శ్రామిక వర్గాల సమస్యలపై ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 6న జరిగే కార్మిక బహిరంగ సభకు జిల్లా నుంచి వందలాది మంది కార్మికులు తరలివచ్చి



మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు నిర్వహించేందుకు నాయకులు, కార్మికులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐఎస్ కె రాష్ట్ర సమితి సభ్యులు సుధాకర్ గౌడ్, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బాబురావు, బిఓసి మండల ప్రధాన కార్యదర్శి శ్రీను, హనుమంత్, శంకర్, మల్లయ్య, భవన నిర్మాణ రంగ కార్మికులు పాల్గొన్నారు.

# రాఖి పౌర్ణమి వేడుకల సందర్భంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఘనంగా యజ్ఞ కార్యక్రమం

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర) ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రారంభమైన ప్రత్యేక యజ్ఞం స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్మూర్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక యజ్ఞం కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది లోక కళ్యాణార్థం పట్టణ ప్రజల శ్రేయస్సును కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ఈ పవిత్ర హోమం ఉదయం 8 లకు వేద పండితుల మంత్రోచ్ఛరణాలు శాస్త్ర విధి విధానాల మధ్య ఘనంగా మొదలైంది ఈ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు అనంతరం అమ్మవారికి మహా మంగళ హారతి భక్తులకు భారీగా తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణంలోని ఆర్యవైశ్య బంధువులు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి యజ్ఞంలో పాల్గొని అమ్మవారి కృపా



కటాక్షాలు పొందాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు కమిటీ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి దాచేపల్లి శ్రీనివాస్. బా శెట్టి విజయ్ కుమార్ . పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

బెల్లంపల్లి ఆగస్టు 28 విజన్ ఆంధ్ర : ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ, వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాసిపేట మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి బోధన, తరగతుల నిర్వహణ, వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ విచారణలను పరిశీలించి



ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు సూచించారు.

అనంతరం గ్రామంలో బెల్లంపల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో, నాబార్డ్, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ సహకారంతో నిర్వహిస్తున్న పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడం, అగ్రో ఫారెస్ట్రీ ప్రాజెక్టులో భాగంగా కోలం గిరిజన కుటుంబాలకు మామిడి, ఉసిరి, పనస, జామ, బొప్పాయి తదితర పండ్ల మొక్కలను ఉచితంగా అందజేశారు.

ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కుటుంబాలకు పౌష్టికాహారం, భవిష్యత్తులో అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామస్థులతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించి పనులు వేగవంతం చేయాలని, గిరిజన ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి అనిత, తహసీల్దార్ సునీల్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సప్దర్ అలీ, మండల విద్యాధికారి, ఎఫ్‌పిసి ఛైర్మన్ ఎంబడి కిషన్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, సర్పంచ్‌లు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## –ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్ల, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): అర్హులైన పేద కుటుంబాలకు సొంత గృహాలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రాహీంపల్లి వార్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులు బేగరి సత్యం ('క్యూ' న్యూస్ రిపోర్టర్), ఎర్రవల్లి రాములు నిర్మించుకున్న నూతన గృహాలకు ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు అభివృద్ధి చెందాలని సూచించారు. నూతన గృహాల్లో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాముగౌడ్, కౌన్సిలర్లు, మధుసూదన్‌రెడ్డి, బండారి శైలజాఆగిరెడ్డి, ముడవత్ కృష్ణ నాయక్, గోపాల్ రెడ్డి, కళ్యాణియాదగిరి, శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మధుసూధన్ గుప్తా, గ్రామస్తులు సుదర్శన్ రెడ్డి, రవీందర్ గౌడ్, జగన్ గౌడ్, మహమూద్, ఖలీం, శివకుమార్, క్రిష్ణా, మహమ్మద్ ఖదీర్ హుస్సేన్, శంకర్ పాత్రికేయులు మాచన్ పల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# అన్నా-చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

బెల్లంపల్లి ఆగస్ట్ 28 విజన్ ఆంధ్ర : అన్నా--చెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు కౌన్సిలర్ తాండ్ర స్రవంతి, తాండూరు మాజీ ఎంపీపీ శ్రీదేవి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి మన సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం కలిగిన పండుగ అన్నారు. సోదరసోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, ఆత్మీయతను చాటిచెప్పే పర్వదినమని పేర్కొన్నారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తూ, సోదరసోదరీమణుల మధ్య అనుబంధాన్ని మరింత పెంపొందిస్తుందని అన్నారు. మహిళలు, ఆడబిడ్డలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని ప్రతి ఆడబిడ్డ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ.. నియోజకవర్గ ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్ఐఆర్ నోటీసులపై ఆధారాలతో విచారణకు హాజరు కావాలి

చేవెళ్ల ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర) : చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 265, 266 పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత ఆధారాలతో విచారణకు హాజరు కావాలని అధికారులు సూచించారు. నో మ్యాపింగ్, వ్యత్యాసాలు తదితర కారణాలతో నోటీసులు అందుకున్న వారు, నోటీసులో పేర్కొన్న కారణానికి అనుగుణంగా ఆధారాలను సమర్పించాలని తెలిపారు. పాత ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో ఓటరు, తల్లిదండ్రులు లేదా భర్త పేర్లు ఉన్న వివరాలను ఆధారంగా చూపించవచ్చన్నారు. అదేవిధంగా జనన ధ్రువపత్రం, పదో తరగతి మెమో, ఆధార్, రేషన్ కార్డు, కుటుంబ రిజిస్టర్, నివాస ధ్రువీకరణ పత్రాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. కుటుంబ సంబంధాన్ని నిరూపించే పత్రాలు అందుబాటులో ఉంటే వాటిని కూడా సమర్పించాలని సూచించారు. వ్యత్యాసాల నోటీసులు అందుకున్న వారు పాత ఓటరు గుర్తింపు కార్డు, పాత ఎన్నికల జాబితా వివరాలను అందించవచ్చన్నారు. అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు,



భార్య లేదా భర్తకు సంబంధించిన పాత ఎన్నికల జాబితా వివరాలు, వివాహ ధ్రువపత్రం, పేరు మార్పునకు సంబంధించిన ప్రభుత్వ పత్రాలను సమర్పించాలని తెలిపారు. ఈ మేరకు ముడిమ్యాల్ గ్రామంలో ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియను అధికారులు నిర్వహించారు.

# ప్రతి పౌరుడికి మొక్కల సంరక్షణ బాధ్యత

**- చెట్ల నరికివేతతో వాతావరణ సమతుల్యతకు ముప్పు**

**- గోక మహిపాల్ రెడ్డి, సర్పంచి, రాంపూర్**

నంగునూరు, ఆగస్టు 28 విజన్ ఆంధ్ర : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి ప్రతి మొక్కను చెట్టుగా పెంచే బాధ్యతను ప్రతి పౌరుడు తీసుకోవాలని రాంపూర్ సర్పంచ్ గోక మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. చెట్లు, అడవులు ప్రకృతికి రక్షణ కవచంగా నిలుస్తాయని పేర్కొన్నారు. చెట్లను విచ్చలవిడిగా నరికివేత వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని చెప్పారు. దీంతో కరవు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు వంటి సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని రాంపూర్ లో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. వాటిని ఇంటి పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో, పొలాల గట్ల వెంట నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వాలు, స్థానిక సంస్థలతో పాటు ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. మొక్కను నాటి వదిలేయకుండా దానికి నీరు పోసి, అవసరమైన సంరక్షణ అందిస్తేనే అది భవిష్యత్తులో పెద్ద చెట్టుగా మారుతుందని చెప్పారు.

చెట్టు నీడను అందించడంతో పాటు ఆక్సిజన్‌ను అందించడం, కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించి నేల కోతను నివారించి భూసారాన్ని




పరిరక్షిస్తుందని తెలిపారు. పక్షులు, చిన్న జీవులకు ఆవాసం కల్పించి పర్యావరణ సమతుల్యతను కాపాడుతుందని వివరించారు. అభివృద్ధి పేరుతో పెద్దఎత్తున చెట్లను, అడవులను నరికివేయడం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని మహిపాల్ రెడ్డి అన్నారు. అడవుల విస్తీర్ణం తగ్గడం, భూ వినియోగంలో మార్పులు, నీటి వనరులపై ఒత్తిడి, పెరుగుతున్న కాలుష్యం తదితర కారణాలు వాతావరణ మార్పులను మరింత తీవ్రతరం చేస్తున్నాయని పేర్కొన్నారు.

ఎల్ నినో వంటి వాతావరణ పరిణామాలు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు, వర్షపాత నమూనాలపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. నేడు నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు అందించే విలువైన ఆస్తి అని సర్పంచి అన్నారు. గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల వెంట, చెరువుల పరిసరాల్లో, పొలాల గట్లపై స్థానిక వాతావరణానికి అనుకూలమైన మొక్కలను పెంచాలని సూచించారు.

వన మహోత్సవం వంటి కార్యక్రమాలు కేవలం ఒకరోజు కార్యక్రమాలుగా మిగలకుండా "ఒక కుటుంబం--ఒక మొక్క, ఒక మొక్క--ఒక బాధ్యత" అనే స్ఫూర్తితో నిరంతర ఉద్యమంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు నాంపల్లి వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎనగందుల నితిన్ కుమార్ క్షేత్ర సహాయకురాలు గోక అమావాస్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమం ద్వారా గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో బాధ్యతా భావాన్ని పెంపొందించేందుకు ప్రయత్నించారు. "మొక్క నాటడం మన చేతిలో ఉన్న చిన్న పని.. దాన్ని చెట్టుగా పెంచడం మన భవిష్యత్తు తరాల పట్ల ఉన్న పెద్ద బాధ్యత" అనే సందేశంతో రాంపూర్ వన మహోత్సవం పర్యావరణ పరిరక్షణకు ప్రజా భాగస్వామ్యాన్ని చాటింది.

## రాఖీ పౌర్ణమి సందర్భంగా డీసీసీ అధ్యక్షులు బట్టు కరుణాకర్‌కు రాఖీ కట్టిన మహిళా కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర ) రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డీసీసీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ కు రాఖీ కట్టి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీక అని అన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి, వారి గౌరవం, భద్రత, సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మహిళా పట్టణ అధ్యక్షురాలు మాలతి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, జిల్లా కార్యదర్శి కోమల, కో-ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్ శారద, మాజీ కో-ఆప్షన్ సభ్యురాలు కమల, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కమల, మహిళా కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి నూతన సీఐ గా చెన్నూరి శ్రీనివాస్ పదవి భాధ్యతలు



భూపాలపల్లి జిల్లా ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర ) నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా చెన్నూరి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇంతకుముందు ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్‌బీ (స్పెషల్ బ్రాంచ్) సీఐగా విధులు నిర్వహించారు. పోలీసు శాఖలో సుదీర్ఘ అనుభవం కలిగిన చెన్నూరి శ్రీనివాస్ సమర్థవంతమైన సేవలు అందించిన అధికారిగా గుర్తింపు పొందారు. ఆయన నియామకంతో భూపాలపల్లి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొత్త బాధ్యతలు స్వీకరించిన చెన్నూరి శ్రీనివాస్ భూపాలపల్లి ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

## అన్నా చెల్లెలు అనుబంధానికి రాఖీ పండుగ



విజన్ ఆంధ్ర హత్నూరా: అన్న చెల్లెలు అనుబంధానికి ప్రతికంగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగ ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కలకాలం ఉండాలని వారిని ఆశీర్వదించారు రాఖీ అనేది కేవలం ఒక దారం మాత్రమే కాదు అన్న చెల్లెలు మధ్య ఉన్న ప్రేమ ఆప్యాయత నమ్మకానికి ప్రత్యేకంగా భావిస్తారు సోదరుడు తన సోదరికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆమెను కాపాడుకుంటానని మాట ఇస్తూ పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచి ఇళ్లల్లో పండుగ వాతావరణం నెలకొంది కొత్త వస్త్రాలు దర్శించి పూజలు నిర్వహించి కుటుంబ సభ్యులతో కలిసి ఈ పండుగను ఆనందంగా కుటుంబ సభ్యుల మధ్యన జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు ప్రతి సంవత్సరం జరిగే ఈ రాఖీ పౌర్ణమి ఎల్లప్పుడు ఇలాగే నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో తమ కుటుంబ సభ్యులు ఉండాలని వారి సోదరీమణులు కోరుకున్నారుఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వారి సోదరీమణులు సోదరులు పాల్గొన్నారు

# నిర్మించి 15 రోజులకే కుప్ప కూలిన ఇందిరమ్మ ఇల్లు

## - అధికారుల నిలక్ష్యం వల్లనే కాంట్రాక్టుల ఇష్ట రాజ్యం





గాదిగూడ,ఆగస్టు 28(విజన్ ఆంధ్ర ):తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వెనక బడిన కొలం గిరిజనులకు ప్రత్యేకంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లులు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కొలం గిరిజనులకు ఇందిరమ్మ ఇల్లుల నిర్మాణాలు వనులు కొన్నసాగుతున్నాయి.గాదిగూడ మండలం దాబా-బి గ్రామపంచాయతీ పరిధిలోని లొద్దిగూడ పీవీటీజి కొలం గుడ గ్రామానికి చెందిన కడప జంగుబాయి,తండ్రి చిన్నూకు నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో నాసిరకం వనులు చేపట్టడంతో కేవలం 15 రోజులకే ఇంటి పైకప్పు కూలిపోయింది.విషయం తీసుకున్న తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం టీఏవీఎస్ గాదిగూడ మండల కమిటీ లబ్ధిదారి ఇళ్లను సందర్శించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు,నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉన్నప్పటికీ, నాసిరకం నిర్మాణం చేపట్టడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆదివాసీ విద్యార్థి సంఘం గాదిగూడ మండల కార్యదర్శి పెందోర్ ఆరోపించారు.
వెంటనే సంబంధిత అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి,ఇంటి నిర్మాణ నాణ్యతపై సమగ్ర విచారణ చేపట్టాలని,నిబంధనలకు విరుద్ధంగా నాసిరకంగా నిర్మాణం చేపట్టిన గుత్తేదారుపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి న్యాయం చేసి,ఇంటిని నాణ్యతా ప్రమాణాలతో పటిష్టంగా నిర్మించి ఇవ్వాలని కోరారు.
ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి క్రిష్ణ, టిఏవిఎస్ మండల కమిటీ నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థినులు దేశం, ధర్మం పట్ల బాధ్యతతో మెలగాలి

## – బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి



చేవెళ్ల, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): విద్యార్థినులు విద్యతో పాటు దేశం, ధర్మం పట్ల బాధ్యతను పెంపొందించుకోవాలని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి అన్నారు. చేవెళ్ల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అత్తెల్లి అనంతరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని పరస్పరం రాఖీలు కట్టుకున్నారు. రాఖీ పౌర్ణమి సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. దేశం, ధర్మం, సమాజ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు "నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనిద్దరం ఈ దేశానికి, ధర్మానికి రక్ష" అంటూ ప్రతిజ్ఞ చేశారు. దేశ అభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇంద్రసేనారెడ్డి, చేగురి ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- చెరువుల వద్ద భద్రతా చర్యలపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- క్రేన్లు, బ్యారికేడింగ్, లైటింగ్ ఏర్పాట్లపై దృష్టి
- ట్రాఫిక్, పార్కింగ్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- పోలీస్, జీహెచ్ఎంసీ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జనం నిర్వహణ

కొంపల్లి, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): రానున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా కొంపల్లి, దూలపల్లి చెరువులను కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య, జీహెచ్ఎంసీ డీఈ విరాట్, పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ విజయ్ వర్ధన్ తదితర అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్ల ఏర్పాటు, భక్తుల రాకపోకలకు అనుగుణంగా బ్యారికేడింగ్, తగినంత లైటింగ్, విద్యుత్ సౌకర్యాలు, రహదారుల పరిస్థితి తదితర అంశాలను పరిశీలించారు. అలాగే నిమజ్జన సమయంలో వాహనాల రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, వాహనాల పార్కింగ్ ప్రదేశాల గుర్తింపు, పోలీస్ బందోబస్తు, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపైనా దృష్టి సారించారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా పోలీస్, జీహెచ్ఎంసీ, ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులు పేర్కొన్నారు.

## రక్షాబంధన్ వేడుకల్లో డాక్టర్. మడికొండ శీను

హనుమకొండ జిల్లా పరకాల విజన్ ఆంధ్ర: పరకాల పట్టణంలో రక్షాబంధన్ వేడుకలలో భాగంగా టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్-చైర్మన్ డాక్టర్. మడికొండ శ్రీను గారికి సోదరీమణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేయగా, రాఖీ కట్టిన సోదరీమణులను నిండు నూరేళ్ల సంతోషంగా జీవించాలని దీవించి, వారికి గిఫ్టులు అందించిన మీ డాక్టర్. మడికొండ శ్రీను...



## తాటిగూడలో డ్రాఫ్ట్ ఓటర్ జాబితాపై ప్రత్యేక గ్రామసభ



బెల్లంపల్లి ఆగస్ట్ 27 విజన్ ఆంధ్ర : కాసిపేట మండలంలోని తాటిగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్--2026 డ్రాఫ్ట్ ఓటర్ జాబితాపై గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మడావి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అధికారులు డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను గ్రామస్తులకు చదివి వినిపించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. పేర్లలో తప్పులు, వివరాల్లో మార్పులు లేదా పేర్లు గల్లంతైనట్లయితే సంబంధిత అధికారులకు అభ్యంతరాలు, దరఖాస్తులు సమర్పించాలని కోరారు. గ్రామసభలో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలు, దరఖాస్తులను అధికారులు నమోదు చేసుకున్నారు. వాటిని పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టి తుది ఓటర్ జాబితాను సిద్ధం చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ తమ్మినేని విజయలక్ష్మి శ్యామ్‌శేఖర్, వార్డు సభ్యులు మడావి దేవు, మడావి జమున, సిడం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, బీఎల్ఓ కొయ్యాల సరోజ, పంచాయతీ సిబ్బంది, గ్రామ యువత, ప్రజలు పాల్గొన్నారు.

## పద్మశాలిలు ఘనంగా జంధ్యాధారణ-రక్షాబంధన్ కార్యక్రమం

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర ) రామాలయం, మార్కండేయ దే వాలయంలో ఆదర్శ పద్మశాలి సహకార సంఘం –– పద్మశాలి పరపతి సంఘాల ఆధ్వర్యంలో జంధ్యాధారణ మరియు పరస్పర మైత్రి, సోదరభావానికి ప్రతీకగా రక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమంలో భాగంగా తొలుత శ్రీ మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాల సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన సుమారు 50 మంది పద్మశాలీలు నూతన యజ్ఞోపవీతాలను (జంధ్యాలను) ధరిస్తూ జంధ్యాధారణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పరస్పర మైత్రి, సోదరభావం, పద్మశాలీల ఐక్యతను చాటేలా రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రి పొన్నం

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటివరకు రూ.12 వేల కోట్ల విలువైన ప్రయాణ సేవలు**

**రాఖీ పౌర్ణమి సందర్భంగా దాదాపు 5 వేల ఆర్టీసీ బస్సుల నిర్వహణ**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 28 : రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రానికి వెళ్తున్న క్రమంలో సిద్దిపేట జిల్లా పందిళ్ల నుంచి హుస్నాబాద్ బస్‌స్టేషన్ వరకు సాధారణ ప్రయాణికులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సులోని మహిళా ప్రయాణికులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. మహిళా ప్రయాణికులు రాఖీలు కట్టడంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ప్రయాణికులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి ప్రయాణ అనుభవాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లో కూడా ప్రజలు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరేందుకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు మరియు ప్రయాణికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ రోజుల్లో కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల కోసం సేవలందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది సేవలను అభినందించారు.

మహిళలకు ఉచిత ప్రయాణం.. ఇప్పటివరకు రూ.12 వేల కోట్ల విలువైన సేవలు

ప్రజా పాలన ప్రభుత్వంలో మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో



మహిళలు సుమారు రూ.12 వేల కోట్ల విలువైన ప్రయాణాన్ని ఉచితంగా పొందారని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగిందని, పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా దాదాపు 5 వేల ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని మంత్రి వెల్లడించారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం

200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితర పథకాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసులపై ఆధారాలతో విచారణకు హాజరు కావాలి

చేవెళ్ల ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర) : చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 265, 266 పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత ఆధారాలతో విచారణకు హాజరు కావాలని అధికారులు సూచించారు. నో మ్యాపింగ్, వ్యత్యాసాలు తదితర కారణాలతో నోటీసులు అందుకున్న వారు, నోటీసులో పేర్కొన్న కారణానికి అనుగుణంగా ఆధారాలను సమర్పించాలని తెలిపారు. పాత ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో ఓటరు, తల్లిదండ్రులు లేదా భర్త పేర్లు ఉన్న వివరాలను ఆధారంగా చూపించవచ్చన్నారు. అదేవిధంగా జనన ధ్రువపత్రం, పదో తరగతి మెమో, ఆధార్, రేషన్ కార్డు, కుటుంబ రిజిస్టర్, నివాస ధ్రువీకరణ పత్రాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. కుటుంబ సంబంధాన్ని నిరూపించే పత్రాలు అందుబాటులో ఉంటే వాటిని కూడా సమర్పించాలని సూచించారు. వ్యత్యాసాల నోటీసులు అందుకున్న వారు పాత ఓటరు గుర్తింపు కార్డు, పాత ఎన్నికల జాబితా వివరాలను అందించవచ్చన్నారు. అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు, భార్య లేదా భర్తకు సంబంధించిన పాత ఎన్నికల జాబితా వివరాలు, వివాహ ధ్రువపత్రం, పేరు మార్పునకు సంబంధించిన ప్రభుత్వ పత్రాలను సమర్పించాలని తెలిపారు. ఈ మేరకు ముడిమ్యాల్ గ్రామంలో ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియను అధికారులు నిర్వహించారు.

## కొయ్యూరులో ఇందిరా శక్తి కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

**మంత్రి శ్రీధర్ బాబు కృషితో మహిళలకు స్వయం ఉపాధి**

మల్హర్, ఆగస్టు 27 విజన్ ఆంధ్ర : తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కృషితో మల్హర్ మండలం కొయ్యూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరా శక్తి కుట్టు శిక్షణ కేంద్రాన్ని కొయ్యూరు గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగిడి శ్రీనివాస్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండ రాజమ్మ మాట్లాడుతూ, ఐదు గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం దుస్తులు కుట్టే బాధ్యతను స్థానిక మహిళలకు అప్పగించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇందిరా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, వల్లెంకుంట సర్పంచ్ బొమ్మ రమేష్ రెడ్డి, ఉప సర్పంచులు, ఏపీఎం తెప్పల రజిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాఖీ పండుగ సంబరాలు

వాజేడు,ఆగస్టు28(విజన్ ఆంధ్ర): సోదరి సోదరుని చేతికి రాఖీ కట్టి అతను తనను రక్షిస్తాడని నమ్మకంతో ఆశీర్వదిస్తుంది. అదేవిధంగా సోదరుడు బహుమతులు ఇచ్చి, జీవితాంతం రక్షిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. రాఖీ పండుగ సోదరి సోదర బంధం, రక్షణ, ప్రేమను సూచిస్తుంది. వాజేడు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపి, స్వీట్స్ తినిపించారు. రాఖీ కట్టిన సోదరీమణులకు సోదరులు కానుకలు అందించారు



## శేరిగూడలో అంబరాన్నంటిన బోనాల సంబరం

### -శ్రావణమాస ముగింపు వేళ భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవాలు



షాద్ నగర్, విజన్ ఆంధ్ర ఆగస్టు 28 : షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం శేరిగూడలో శ్రావణమాస ముగింపు సందర్భంగా మైసమ్మ, పోచమ్మ బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ శారద శంకరయ్య గౌడ్, షాద్‌నగర్ ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు మల్కయ్య గారి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, మంగళవాయిద్యాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నంగునూరు మండల వ్యాప్తంగా ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

నంగునూరు, ఆగస్టు 28 విజన్ ఆంధ్ర : నంగునూరు మండల వ్యాప్తంగా రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) వేడుకలు శుక్రవారం నాడు అత్యంత వైభవంగా, అట్టహాసంగా జరిగాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల పవిత్ర బంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.

ఉదయం నుంచే సోదరీమణులు సాంప్రదాయ దుస్తులు ధరించి, తమ సోదరులకు నుదుట తిలకం దిద్ది, హారతులు ఇచ్చి రాఖీలు కట్టారు. తమ అన్నదమ్ములు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ మిఠాయిలు తినిపించారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు రక్షణగా ఉంటామని మాట ఇస్తూ, వారికి ప్రత్యేక కానుకలు, నగదు అందజేసి తమ ప్రేమను చాటుకున్నారు.

పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని మార్కెట్లు, స్వీట్ షాపులు, రాఖీ స్టాళ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి సోదరుల వద్దకు వెళ్లే మహిళా ప్రయాణికులతో బస్సులు, రోడ్లన్నీ రద్దీగా మారాయి. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా విద్యార్థులు



ఒకరికొకరు రాఖీలు కట్టుకుని పండుగ ప్రాముఖ్యతను చాటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు మండల వ్యాప్తంగా భద్రతా చర్యలు పర్యవేక్షించారు.

మండల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మరియు వివిధ సంఘాల నాయకులు మండల ప్రజలందరికీ రక్షాబంధన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ ఉమ్మడి కుటుంబాల ప్రాముఖ్యతను, కుటుంబ బంధాల మధురిమలను గుర్తుచేసిందని మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

## ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్:



మాజీ ఎమ్మెల్యే రత్నం

చేవెళ్ల, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర) : రాఖీ పౌర్ణమి సోదరభావానికి ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే, భాజపా నాయకుడు కె.ఎస్. రత్నం అన్నారు. శుక్రవారం భాజపా మున్సిపల్ అధ్యక్షుడు అతెల్లి అనంతరెడ్డి నివాసంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోదరీమణులతో రాఖీ కట్టించుకుని శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ కులమతాలకు అతీతంగా ఆత్మీయత, సోదరభావాన్ని పెంపొందించే పండుగ అని రత్నం పేర్కొన్నారు. ప్రజలంతా ప్రేమాభిమానాలతో మెలగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోదరీమణులు ఆయనకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం, అతెల్లి విట్టల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ రాగం.. అన్నాచెల్లెళ్ల అనురాగం

### - ప్రేమకు ప్రతీకగా రాఖీ వేడుకలు

### - సోదర బంధంతో పల్లెపట్టణాల్లో పండుగ సందడి

చేవెళ్ల, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని చేవెళ్ల మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఆప్యాయతలు వెల్లివిరిశాయి. పవిత్ర పండుగ వేళ ఆడపడుచులు తమ సోదరులకు ప్రేమతో రాఖీలు కట్టి, వారి క్షేమం, ఆయురారోగ్యాలను ఆకాంక్షించారు. సంప్రదాయబద్ధంగా హారతులు ఇచ్చి, తీపి పదార్థాలు తినిపిస్తూ తమ అనురాగాన్ని చాటుకున్నారు. సోదరులు సైతం తమ సోదరీమణులకు కానుకలు అందజేసి, జీవితాంతం అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు తమ అనుబంధం కలకాలం కొనసాగాలని, సోదరుల



జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యుల కలయికతో పల్లెలు, పట్టణాల్లో సందడి నెలకొని రాఖీ వేడుకలు కన్నులపండువగా సాగాయి.

## మంత్రి పొన్నం క్యాంపు కార్యాలయంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగస్టు 28 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ మహిళ నాయకురాళ్లు , మహిళ కార్యకర్తలు పెద్ద ఎత్తున రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా సోదరీమణులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆప్యాయంగా ముచ్చటిస్తూ,వారిని పలకరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం మహిళా సోదరీమణులకు స్వీట్లు తినిపించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీక అని అన్నారు. మహిళల భద్రత, గౌరవం, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి కుటుంబంలో సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు మరింత బలపడాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బూరుగులతకిష్ణస్వామి, సావుల మంజుల,చేన్నవేణి అనూషవిద్యాసాగర్, కొండ రజితసత్యనారాయణ,కేశవేణి సరిత, ఆకుల రజిత,బత్తుల స్వరూపరవీందర్, కో ఆప్షన్ సభ్యులు పున్న లావణ్య, భూక్య సరోజన, ఖాతా గ్లోరీనా,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఆనందోత్సవాల మధ్య మంత్రి పొన్నంకు రాఖీలు కట్టిన మహిళలు



## అర్హులైన ప్రతి ఒక్కరికి డిజిటల్ రైషన్ కార్డుల పంపిణీ

**-సర్పంచ్ గేడం అమృత్ రావ్**

గాదిగూడ, ఆగస్టు 28(విజన్ ఆంధ్ర ) : అర్హులైన ప్రతి ఒక్కరికి డిజిటల్ రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సర్పంచ్ గేడం అమృత్ రావ్ అన్నారు.శుక్రవారం మండలంలోని ఖడ్డోడి గ్రామపంచాయతిలో నిర్వహించిన నూతన డిజిటల్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.గ్రామపంచాయతీలోని అర్హులైన పేదవారికి ఆహార భద్రత కల్పించి,ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో రైషన్ డీలర్ ఆనంద్ రావ్,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సేవలను గుర్తిస్తూ ఘనంగా వీడ్కోలు

మందమర్రి, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : సింగరేణి సంస్థలో సి. హెచ్.పి కార్పొరేట్ జీఎం ఈఅండ్ఏంగా అనేక సేవలందించి ఈ నెల 31 న పదవి విరమణ పొందుతున్న సోమయాజులు రామూర్తికి అధికారులు,సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం స్థానిక జిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శాలువాతో సన్మానించి బహుమతి అందించారు. రామ్మూర్తి అందించిన సేవలను జిఎం గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎస్వోటుజియం లలిత్ ప్రసాద్,ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి ఝా,ఏ జిఎం ప్రసాద్,కేకే ఏజెంట్ ఖాదీర్,ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు,ఇంజనీర్ వంశీధర్,డిజిఎం కిరణ్ కుమార్,ఆర్కేపీ సి. హెచ్.పి ఎస్ఈ చంద్రమౌళి,నరేష్ పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్షెట్టిపేట ఆగస్టు, 28 ( విజన్ ఆంధ్ర ) లక్షెట్టిపేట సబ్ స్టేషన్ పరిధిలో నూతన33/11 కె.వి బ్రేకర్స్ అమర్చుట, మరమ్మతుల దృశ్య విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.లక్షెట్టిపేట సబ్ స్టేషన్ పరిధిలో శనివారం, ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు లక్షెట్టిపేట,ఉత్కూర్, మోదెల, గంపలపల్లి,ఇటిక్యాల గ్రామాలకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ఆడపడుచుల ఆత్మీయతే కొండంత బలం

**మహిళల సంక్షేమం, భద్రతకు ఎల్లప్పుడూ అండగా ఉంటా**

**రాఖీ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ రాఖీ కట్టి సోదరభావం చాటుకున్న మహిళా ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): రాఖీ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సోదరభావం వెల్లివిరిసింది. నియోజకవర్గానికి చెందిన మహిళా ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు, మహిళలు శుక్రవారం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ నివాస కార్యాలయంలో నిర్వహించిన రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ.. ఆడపడుచుల ఆత్మీయత, అభిమానమే తనకు కొండంత బలమని అన్నారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. తన గెలుపులో మహిళా సోదరీమణుల పాత్ర కీలకమని, వారి అభిమానాన్ని ఎప్పటికీ మరువలేనని తెలిపారు. రాఖీ పండుగ సోదరసోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. మహిళా సోదరీమణులందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ వేడుకల్లో మహిళా ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు, మహిళలు పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ సందడి వాతావరణం నెలకొంది.

# జాతీయ క్రీడా దినోత్సవానికి ఘనంగా శ్రీకారం

**- మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి**

**- 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు క్రీడా వేడుకలు**

**- క్రీడలతో ఆరోగ్యం.. యువతలో ప్రతిభకు ప్రోత్సాహం**

దుండిగల్, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జాతీయ క్రీడా దినోత్సవం–2026 వేడుకలకు శుక్రవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. భారత హాకీ దిగ్గజం, ఒలింపియన్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు వివిధ క్రీడా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా తొలిరోజు జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి జిల్లా యువజన, క్రీడల అధికారి వై. దామోదర్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ధ్యాన్‌చంద్ దేశానికి అందించిన క్రీడా సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. యువత క్రీడల వైపు ఆకర్షితులై తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని అధికారులు సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా సైక్లింగ్ కోచ్‌తో పాటు జిల్లా యువజన, క్రీడల శాఖ సిబ్బంది పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికారులు తెలిపారు.

# పీహెచ్‌సీలో కోతుల బెడద..

## అధికారుల నిర్లక్ష్యంపై రోగుల ఆగ్రహం

**- గట్ల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రక్షణ కరువు**

**- కోతులమయమైన పి హెచ్ సి సెంటర్**

**- హెల్త్ ఆఫీసర్, సిబ్బంది నిర్లక్ష్యం రోగులపాలిట శాపంగా మారిన వైనం**





నంగునూరు, ఆగస్టు 28 విజన్ ఆంధ్ర: సిద్దిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని గట్ల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రాఆజ) సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం వందలాది మంది రోగులకు వైద్య సేవలు అందించాల్సిన ఈ ఆసుపత్రికి కనీస రక్షణ కరువైందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఆరోగ్య కేంద్రం కిటికీల అద్దాలు పగిలిపోవడంతో ఆసుపత్రి ప్రాంగణం మొత్తం కోతుల మయంగా మారింది. కోతులు గుంపులు గుంపులుగా ఆసుపత్రిలోకి ప్రవేశించి, వార్డుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో చికిత్స కోసం వచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలు కోతుల దాడి భయంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. ఆసుపత్రిలోని మందులు, రికార్డులను సైతం కోతులు నాశనం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం రోగుల పాలిట శాపంగా మారిందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రిలో కనీస పారిశుధ్యం లోపించిందని, కిటికీలు విరిగిపోయి కోతులు లోపలికి వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ప్రజలు మండిపడుతున్నారు.వైద్యం కోసం వచ్చి కొత్త రోగాలను కొని తెచ్చుకోవాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే గట్ల మల్యాల పి. హెచ్.సికి తగిన రక్షణ కల్పించాలని, పగిలిన కిటికీలను పునరుద్ధరించి కోతుల బెడద నుండి కాపాడాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.



# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

## - మండలంలో సందడిగా కనిపించిన దుకాణాలు

నల్లబెల్లి,ఆగస్ట్ 28(విజన్ ఆంధ్ర) : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అను రాగానికి ప్రతీక అయిన రక్షాబంధన్ పండుగతో ఇంటింట సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అక్క చెల్లెల్లు అన్నాదమ్ముళ్లకు రాఖీలు కట్టి సోదరబావాన్ని చాటుకున్నారు. హారతులు ఇచ్చి కలకాలం కలిసి ఉండాలని ఆకాక్షించారు. అక్క తమ్ముడికి, చెల్లెలు అన్నయ్యకి రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. ప్రతీ ఇంటిలోను రాఖీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. రాఖీలు కొనడానికి ముందురోజు నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో రాఖీలను కొనుగోలు చేయడంతో మండల కేంద్రంలోని దుకాణాలు సందడిగా కనిపించాయి. రాఖీలు తీసుకొని తోబుట్టువులు పుట్టింటికి చేరుకున్నారు. తమకు రాఖీలు కట్టిన అక్క చెల్లెళ్లకు సోదరులు కానుకలు సమర్పించారు.

# తెలంగాణ సరిహద్దు వరకు బీటీ రహదారి మరమ్మతులు చేపట్టాలి



గాదిగూడ,ఆగస్టు 28(విజన్ ఆంధ్ర ): జీవితి మండల కేంద్రం నుంచి తెలంగాణ సరిహద్దు వరకు బీటీ రహదారి మరమ్మతులు చేపట్టాలని మహారాష్ట్ర రాజురా నియోజకవర్గ ఎమ్మెల్యే దేవురావ్ బొంగ్డేను తెలంగాణకు చెందిన సర్పంచ్‌లు కోరారు. గురువారం మహారాష్ట్రలోని ఎల్లాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించిన సందర్భంగా లోకారి-కె, ఖడ్డోడి, కొత్తపల్లి గ్రామపంచాయతీల సర్పంచ్‌లు మండాడీ పుష్పలత, జాకు గేడం అమృత్‌రావ్, కొట్నాక్ బారిక్‌రావ్ కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా జీవితి నుంచి లోకారి-కె వరకు మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే దేవురావ్ బొంగ్డే స్పందిస్తూ.. రహదారి మరమ్మతులు,లోకారి-కె వరకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో సరిహద్దు ప్రాంత ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగుతాయని సర్పంచ్‌లు తెలిపారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికి డిజిటల్ రైషన్ కార్డుల పంపిణీ

## - సర్పంచ్ గేడం అమృత్ రావ్,

గాదిగూడ, ఆగస్టు 28(విజన్ ఆంధ్ర ): అర్హులైన ప్రతి ఒక్కరికి డిజిటల్ రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సర్పంచ్ గేడం అమృత్ రావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖడ్డోడి గ్రామపంచాయతిలో నిర్వహించిన నూతన డిజిటల్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామపంచాయతీలోని అర్హులైన పేదవారికి ఆహార భద్రత కల్పించి, ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైషన్ డీలర్ ఆనంద్ రావ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

మందమర్రి,రామకృష్ణాపూర్,ఆగస్టు 28(విజన్ ఆంధ్ర) : కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలైన ఘటన క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం స్థానిక సింగరేణి ఠాగూర్ స్టేడియం సమీపంలోని నివాస ప్రాంతాలలో ఒక్కసారిగా కోతులు గుంపులుగా సంచరించి గండమల్ల భాగ్యమ్మ అనే వృద్ధురాలి చేతిపై దాడి చేశాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు తక్షణమే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వృద్ధురాలికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలోనే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోతుల బెడద నుంచి మున్సిపల్ అధికారులు పుర ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.



# ప్రభుత్వ విద్యను పటిష్ఠం చేయాలి

## - కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి
## - ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి
## -నూతన విద్యా విధానం--2020తో విద్యారంగంలో ప్రైవేటీకరణకు ఊతం
## - పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉచిత, నాణ్యమైన విద్య అందించాలి



బాచుపల్లి, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంతోపాటు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు కఠినమైన ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని సీపీఎం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలను పరిష్కరించి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

నూతన విద్యా విధానంతో ప్రైవేటీకరణకు అవకాశం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం--2020 విద్యారంగంలో పెనుమార్పులు తీసుకువస్తామని చెబుతున్నప్పటికీ, విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ వైపు నడిపించే విధంగా ఉందని పి.సత్యం విమర్శించారు. విద్యను కేంద్రీకరించడం, ఉన్నత విద్యలో ప్రైవేటు, విదేశీ పెట్టుబడులకు అవకాశాలను పెంచడం, పాఠశాలల విలీనాలు, మూసివేతలు వంటి చర్యలు పేద, మధ్యతరగతి, గ్రామీణ విద్యార్థులకు విద్యను దూరం చేసే ప్రమాదం ఉందన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, లౌకికత్వాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరికీ ఉచితంగా, నాణ్యమైన విద్య అందే విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతుల కొరత

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని పి.సత్యం తెలిపారు. అనేక పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు లేవని, ఉపాధ్యాయుల ఖాళీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని పేర్కొన్నారు. ఉప్పల్‌లోని పాఠశాలలో డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్న పరిస్థితి ఉందని, కొన్ని ప్రాంతాల్లో జూనియర్, డిగ్రీ కళాశాలలు ఒకే భవనాల్లో షిఫ్ట్ పద్ధతిలో కొనసాగుతున్నాయని తెలిపారు.

85 శాతం పాఠశాలలు ప్రైవేటువేనని వెల్లడి

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల విస్తరణ వేగంగా జరుగుతోందని ఆయన అన్నారు. జిల్లాలోని పాఠశాలల్లో సుమారు 85 శాతం ప్రైవేటు రంగంలో ఉండగా, కళాశాలల్లో సుమారు 95 శాతం ప్రైవేటు విద్యాసంస్థలేనని తెలిపారు. ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల పేరుతో మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేసి ప్రచారానికే పరిమితం కాకుండా, అన్ని ప్రభుత్వ పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు.

విద్యా సదస్సును జయప్రదం చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న జిల్లా విద్యా సదస్సును జయప్రదం చేయాలని పి.సత్యం పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఫీజుల నియంత్రణ, విద్యార్థుల సమస్యలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం బాచుపల్లి మండల కార్యదర్శి వెంకట రామయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, బాచుపల్లి మండల కమిటీ సభ్యులు బాల వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, సీపీఎం నాయకులు నాగభూషణ్, బాల, స్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్ర విధిగా ఘనంగా ఉపాకర్మ మహోత్సవం



గోపాల్ పేట్ ఆగస్టు 28:(విజన్ఆంధ్ర) : శ్రావణ పౌర్ణమి సందర్భంగా బుద్ధారం గండి క్షేత్రం లో వెలసిన శ్రీ రాజరాజేశ్వరీ సహిత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో ఉపాకర్మ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది .

ఈ సందర్భంగా వేద పండితుల జోషి గోపాల శర్మ యార్లపాటి ధీరజ్ శర్మ యార్లపాటి గణేష్ శర్మ బ్రాహ్మణ సంఘాల సమన్వయ కర్త బక్షి శ్రీధర్ రావు ల ఆధ్వర్యంలో వటువులకు ఉపాకర్మ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి, వేదాధ్యయనానికి సంబంధించిన విశిష్టతను వివరించారు. అనంతరం వటువులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వటువులకు వేదాలు ఎన్ని, వాటిలోని వివిధ శాఖలు,

## వటువులకు వేదాల విశిష్టత, ప్రాముఖ్యతపై అవగాహన

వేదాల ప్రాముఖ్యత, వేదాధ్యయనం యొక్క ఉద్దేశ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వేదం కేవలం మంత్రాల సమాహారం మాత్రమే కాదని, అది ఒక జీవన విధానమని, వేదం అనగా జ్ఞానం--విజ్ఞానానికి సంబంధించిన విశాలమైన జ్ఞాన సంపద అని వివరించారు.

వేదాలలో మనిషి వ్యక్తిగత జీవనం నుంచి సమాజ శ్రేయస్సు వరకు అనేక విలువలు, ఆచారాలు, ధర్మసూత్రాలు, ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన భావనలు ఉన్నాయని తెలిపారు. వేదాధ్యయనం ద్వారా ధర్మం, సత్యం, క్రమశిక్షణ, సేవాభావం వంటి సద్గుణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. వేద స్వరూపుడైన పరమేశ్వరుని అనుగ్రహంతో వేదాధ్యయనం నిరంతరం కొనసాగాలని, వేదపారాయణం మరియు వేదాచరణ ద్వారా లోకకల్యాణం, సమాజ శ్రేయస్సు కలగాలని ఆకాంక్షించారు.

ఉపాకర్మ మహోత్సవంలో వటువులు, వేద పండితులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రాఖీ పండుగ సోదరభావానికి ప్రతీక



### - జగద్గిరిగుట్ట మహిళలకు కావలి చంద్రయ్య శుభాకాంక్షలు

జగద్గిరిగుట్ట, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని జయదీర్గుట్ట టూ-ఎయిటీ డివిజన్ మహిళలకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్ కావలి చంద్రయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పరస్పర ప్రేమ, ఆప్యాయత, ఆత్మీయతలకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి మహిళ జీవితంలో ఆనందం, ఆరోగ్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, వారి కుటుంబాలు సుఖశాంతులతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

మహిళల సంక్షేమం, వారి భద్రత, అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కావలి చంద్రయ్య పిలుపునిచ్చారు. రాఖీ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు.

# రాఖీ పండుగ వేళ పోలీస్ స్టేషన్‌లో సందడి

### - రాఖీ పండుగను ఘనంగా నిర్వహించిన కోయ్యూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది

మల్వార్, ఆగస్టు 28 విజన్ ఆంధ్ర : రాఖీ పండుగ సందర్భంగా కోయ్యూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుల్ పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

రాఖీ పండుగ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సోదరభావం, ఆత్మీయత వెల్లివిరిసింది. పోలీసు విధుల్లో భాగంగా ప్రజలకు రక్షణ కల్పిస్తూ నిరంతరం సేవలందిస్తున్న పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి వారి సేవలను అభినందించారు.

ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది మాట్లాడుతూ రాఖీ పండుగ సోదర--సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలకు, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని రాఖీ పండుగ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు. దీంతో కోయ్యూరు పోలీస్ స్టేషన్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

# యువత ఉరకలెత్తాలి.. భారత్ వికసించాలి

### - మెడ్చల్--మల్కాజిగిరిలో ఖేలో ఇండియా డైలాగ్ ప్రధానమంత్రి మోదీ సందేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు

### - క్రీడలు.. ఫిట్‌నెస్.. క్రమశిక్షణే విజయానికి సోపానాలు మాదకద్రవ్యాలకు దూరంగా ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి

### వికసిత భారత్--2047 నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

కుత్బుల్లాపూర్, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): క్రీడా స్ఫూర్తితో యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చడమే లక్ష్యంగా 'ఖేలో ఇండియా డైలాగ్--ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్' కార్యక్రమాన్ని మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మై భారత్, కేంద్ర యువజన వ్యవహారాలు--క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని రెండు విద్యాసంస్థల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులు, విద్యార్థులతో నిర్వహించిన ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించారు. క్రీడలు కేవలం పతకాలు సాధించేందుకు మాత్రమే కాకుండా యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పట్టుదల, జట్టు స్ఫూర్తిని పెంపొందించే సాధనాలుగా నిలుస్తాయని కార్యక్రమం ద్వారా సందేశం అందింది.

**క్రీడలతోనే ఆరోగ్యకర సమాజం**



కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు జి. సాయి చరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొంటూ యువతకు స్ఫూర్తినిచ్చారు. క్రీడా రంగంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రతిరోజూ సాధన చేస్తే ప్రతిభను విజయంగా మలుచుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. నాగుల వేణు, డా. డి. పద్మ, డా. ఎ. గోపాల్ పాల్గొన్నారు.

**క్రీడాకారులతో ముఖాముఖి**

మెడ్చల్‌లోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సైక్లిస్ట్ అల్లాడి సాయి శ్రేయస్, కోచ్ అల్లాడి కృష్ణ, స్విమ్మర్లు విష్ణు వర్ధన్, వర్షిత్ ధులిపూడి, అభయ్ లక్కోజు, సచిన్ సాత్విక్, కశిష్ శ్రీవాస్తవ పాల్గొని విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించారు. క్రీడా రంగంలో అవకాశాలు, సాధన, క్రమశిక్షణ తదితర అంశాలపై విద్యార్థులతో వారు ముచ్చటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రాధ, పి.వి. నాగలక్ష్మి, ప్రతిభ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఇ. నాగలక్ష్మి పాల్గొన్నారు.

**మై భారత్‌లో యువత నమోదు చేసుకోవాలి**

మై భారత్ ప్రతినిధులు కిరణ్‌కుమార్ కందుకూరి, ఎ. హర్షిత రెడ్డి, ఇ. వికాస్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవ, నాయకత్వం, అనుభవాధారిత అభ్యాసం, దేశ నిర్మాణానికి సంబంధించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027లో యువత చురుగ్గా పాల్గొని తమ ఆలోచనలు, ప్రతిభ, సృజనాత్మకతను దేశ అభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు.

**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

క్రీడలు, ఫిట్‌నెస్, క్రమశిక్షణతో పాటు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే ఆరోగ్యకర జీవనశైలిని యువత అలవర్చుకోవాల్సిన అవసరాన్ని కార్యక్రమంలో వివరించారు. యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే దేశ భవిష్యత్తు మరింత బలోపేతమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

**యువతే దేశానికి బలం**

మై భారత్ మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి స్నేహల్ ద్న్యానేశ్వర్ బసుట్కర్ మాట్లాడుతూ యువత క్రీడలు, ఫిట్‌నెస్‌ను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. మై భారత్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తమ ప్రతిభ, ఆలోచనలు, శక్తిని దేశ నిర్మాణానికి వినియోగించాలని పిలుపునిచ్చారు. వికసిత భారత్--2047 లక్ష్య సాధనలో యువత కీలక భాగస్వాములుగా మారాలని ఆమె ఆకాంక్షించారు. క్రీడా మైదానాల నుంచి దేశ నిర్మాణం వరకు యువత ముందుండాలని సూచించారు.

**పెళ్లిళ్లయిన 8 ఏళ్లకు తొలి కాన్పు.. మాయ రాక**

# బాలింత మృతి

**- పిహెచ్‌సిలో కాన్పు..**

**సూర్యాపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణం**

**- అన్నారం బ్రిడ్జి గ్రామంలో విషాద ఛాయలు**

పెన్ పహాడ్, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర) : వివాహమైన ఎనిమిదేళ్ల తర్వాత ఆ ఇంట చిరునవ్వులు పూశాయి.. తొలి కాన్పులో పండంటి బిడ్డ జన్మించడంతో ఆ కుటుంబం ఆనందపడింది. కానీ, ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. ప్రసవానంతరం ఏర్పడిన వైద్య అత్యవసర పరిస్థితి (మెడికల్ ఎమర్జెన్సీ) ఆ తల్లిని శాశ్వతంగా దూరం చేసింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన మీసాల నాగమణి (31), నాగరాజు దంపతులకు వివాహమై ఎనిమిదేళ్లు అవుతోంది. నాగమణికి ఇది మొదటి కాన్పు. శుక్రవారం తెల్లవారుజామున ఆమెకు నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి)కి తరలించారు. అక్కడ వైద్యులు సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించగా, పండంటి శిశువు సురక్షితంగా బయటకు వచ్చింది. అయితే, కాన్పు పూర్తయిన తర్వాత గర్భాశయం నుండి మాయ (ప్లజంట) బయటకు రాకపోవడంతో నాగమణి పరిస్థితి విషమించింది. దీనిని వైద్య అత్యవసర పరిస్థితిగా గుర్తించిన పిహెచ్‌సి సిబ్బంది, మెరుగైన చికిత్స కోసం ఆమెను వెంటనే సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ, పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్రం ఆమె మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత తల్లి అయిన నాగమణి.. బిడ్డను చూసుకోకుండానే కన్నుమూయడంతో అన్నారం బ్రిడ్జి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా తెలియాల్సి ఉంది.

# నల్లమల్లలో ఘనంగా రాఖీ పండుగ సంబరాలు

**అన్న చెల్లెలు అక్కా. తమ్ముళ్లకు..**

**ఆత్మీయ అనుబంధానికి ప్రేమను రాగాలకు ..**

**ప్రతీక. రాఖీ పౌర్ణమి**

**ప్రజలకు రాఖీ శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ**



అచ్చంపేట ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర) రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గం లోని నల్లమల్ల ప్రాంతాల్లో అక్కాచెల్లెళ్ల అన్నదమ్ములకు ఆత్మీయ అనుబంధానికి వేమనురాగాలకు ప్రత్యేకగా నిలిచే రాఖీ పౌర్ణ మి పండుగ సందర్భంగా ప్రజలు అత్యంత వైభవంగా రాఖీ పండుగను జరుపుకున్నారు ముఖ్యంగా అన్న చెల్లెలు అక్క తమ్ముళ్లు ఆత్మీయ అనుబంధానికి ప్రేమను రాగాలకు నిదర్శనంగా రాఖీ పండుగ ఈసందర్భంగా ఒకరినొకరు రాఖీలు అందించుకొని కట్టుకొని ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుకున్నారు ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే రాఖీ పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు అదే విధంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ అక్కాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాల తో అచ్చంపేట ఎమ్మెల్యే సొంత గృహంలో ఎమ్మెల్యే అక్క చెల్లెలు రాఖీ బంధాన్ని కట్టారు ఈ సందర్భంగా తోబుట్టులతో ఎమ్మెల్యే ఆనందాన్ని వ్యక్తం చేశారు కుటుంబంలో మధుర జ్ఞాపకాలను గుర్తు చేస్తూ బంధాల విలువలను చాటి చెప్పి శుభదినం ప్రతి ఇంట ఆనందాన్ని ఆత్మీయతను నింపాలని కోరుకున్నారు పవిత్రమైన రాఖీ బంధం పౌరులందరికీ జీవితాల్లో ప్రేమ ఐక్యత సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాలని సందర్భంగా ఎమ్మెల్యే కోరారు

# పండుగ వేళ ఆర్టీసీ దోపిడీ

**- ఉదయం రూ.60.. మధ్యాహ్నానికి రూ.80 - పల్లె వెలుగుకి ఎక్స్ ప్రెస్ బోర్డు - ప్రయాణికుల జేబుకు చిల్లు!**

**నాగర్ కర్నూల్-మహబూబ్ నగర్ రూట్ లో చార్జీల పెంపుతో ప్రయాణికుల ఆగ్రహం - ముందస్తు సమాచారం లేకుండానే రూ.20 పెంపు -**

**- హాస్టల్ విద్యార్థులు నడిరోడ్డుపై నరకం..**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 28 : రాఖీ పండుగ వేళ ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు. నాగర్ కర్నూల్-మహబూబ్ నగర్ పల్లె వెలుగు బస్సులో అకస్మాత్తుగా చార్జీలు పెంచడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉదయం రూ. 60 ఉన్న చార్జీని మధ్యాహ్నానికి ఏకంగా రూ. 80 కి పెంచారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పండుగ రోజున ముందస్తు సమాచారం లేకుండా ఇలా చార్జీలు పెంచడం దారుణమని మండిపడుతున్నారు.

విద్యార్థుల కష్టాలు:

చార్జీలు సరిపోక హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదనపు చార్జీ చెల్లించలేక కొంతమంది విద్యార్థులు మార్గమధ్యలోనే బస్సు దిగి నడుచుకుంటూ వెళ్లిన పరిస్థితి నెలకొంది.

పల్లె వెలుగు ఆర్డినరీ బస్సులకు ఎక్స్ ప్రెస్ బోర్డులు తగిలించి ఎక్స్ ప్రెస్ చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని, నాగర్ కర్నూల్ డిపోపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# జీవో నంబర్ 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి

**- పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు**

**- పాలిటెక్నిక్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్‌లో రెండో సంవత్సరంలో కొనసాగించే అవకాశం కల్పించాలి**

**- బీఆర్ఎస్ పార్టీ అక్కన్నపేట మండల నాయకుడు, మాజీ ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్**

అక్కన్నపేట, ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర): పాలిటెక్నిక్ విద్యార్థులు గత పది రోజులుగా జీవో నంబర్ 97ను రద్దు చేయాలని కోరుతూ ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ అక్కన్నపేట మండల నాయకుడు, మాజీ ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు వ్యతిరేకిస్తున్న జీవో 97పై ప్రభుత్వం వెంటనే పునరాలోచించాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యపై అధ్యయనం కోసం ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి రోజులు గడుపుతున్నా విద్యార్థుల సమస్యకు పరిష్కారం చూపడం లేదన్నారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే పాలిటెక్నిక్ విద్యను అందులో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

గతంలో పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్‌లో రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందే అవకాశం ఉండేదని, జీవో 97తో ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందేందుకు పరీక్ష రాయాల్సిన నిబంధనలు తీసుకువస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే నిర్ణయంపై విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆందోళన నెలకొందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోకుండా, పాలిటెక్నిక్ విద్యను స్వతంత్రంగా కొనసాగించాలని కోరారు.

ఇప్పటికైనా ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనను అర్థం చేసుకుని జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని లింగాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, గణేష్ రెడ్డి, పల్లె నరసయ్యతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ వివాదంతో వ్యక్తిపై దాడి..

## మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు --ఎస్ఐ శ్రీహరి

మల్దకల్ ఆగస్టు 28 (విజన్ ఆంధ్ర) జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని ఉలిగేపల్లి గ్రామంలో భూ వివాదం కారణంగా ఓ వ్యక్తిపై దాడి జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి గురువారం తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఉలిగేపల్లికి చెందిన కురువ నర్సింహులు, అతని బంధువులు కురువ తిరుమలేష్, కురువ నర్సింహులు, కురువ జయన్నల మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి భూ సమస్యపై మాట్లాడేందుకు ఫిర్యాదుదారుడు కురువ నర్సింహులు, కురువ జయన్న ఇంటికి వెళ్లాడు.



ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో నిందితులు దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం కురువ తిరుమలేష్ కర్రతో తలపై, కురువ నర్సింహులు వీపుపై దాడి చేయగా, కురువ జయన్న పిడిగుద్దులతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడిలో గాయపడిన బాధితుడిని అతని భార్య చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరి వెల్లడించారు.

# రైతులందరూ వ్యవసాయ క్షేత్రాల్లో 'వ్యవసాయ కుంటలు' నిర్మించుకోవాలి:

**- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**- రాంసింగ్ తండాలో వ్యవసాయ కుంటల పరిశీలన**

**- రైతులతో కలిసి రాఖీ పండుగ జరుపుకున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్**

మహబూబ్‌నగర్ : నవాబ్‌పేట మండలం రాంసింగ్ తండాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా తండా పరిధిలో నిర్మించిన వ్యవసాయ కుంటలను(ఝుతీఎ జూశీఅ౦ం) ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు తమ వ్యవసాయ భూముల్లో తప్పనిసరిగా వ్యవసాయ కుంటలను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన తెలిపారు. పంటల సాగు సమయాల్లో లేదా వర్షాభావ (ఎండల) పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ నీరు నీటిపారుదలకు ఎంతో ఉపయోగపడుతుందని, దీనివల్ల



పంట దిగుబడి పెరిగి రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని వివరించారు.

ఈ పర్యటనలో భాగంగా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్థానిక రైతులతో కలిసి రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఆయనకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.



## NEET-PG పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

### – పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్ : జిల్లాలో ఆగస్టు 30న నిర్వహించనున్న NEET-PG 2026 పరీక్షకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం పరిశీలించారు.

జిల్లా కేంద్రం క్రిస్టియన్ పల్లి లో ఫాతిమా స్కూల్, జీ్రచీజజు,ధర్మాపూర్ లో ఏర్పాటు చేసిన NEET-PG పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి, అభ్యర్థులకు కల్పించనున్న మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆగస్టు 30న ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.

పరీక్షను ప్రశాంతంగా, సురక్షితంగా, క్రమబద్ధంగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టాలని, పరీక్షా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, పర్యవేక్షణ, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.

## రైతులందరూ వ్యవసాయ క్షేత్రాల్లో 'వ్యవసాయ కుంటలు' నిర్మించుకోవాలి

**- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**- రాంసింగ్ తండాలో వ్యవసాయ కుంటల పరిశీలనలి**

**- రైతులతో కలిసి రాఖీ పండుగ జరుపుకున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్**

మహబూబ్‌నగర్ : నవాబ్‌పేట మండలం రాంసింగ్ తండాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా తండా పరిధిలో నిర్మించిన వ్యవసాయ కుంటలను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు తమ వ్యవసాయ భూముల్లో తప్పనిసరిగా వ్యవసాయ కుంటలను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన తెలిపారు. పంటల సాగు సమయాల్లో లేదా వర్షాభావ (ఎండల) పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ నీరు నీటిపారుదలకు ఎంతో ఉపయోగపడుతుందని, దీనివల్ల పంట దిగుబడి పెరిగి రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని వివరించారు. ఈ పర్యటనలో భాగంగా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్థానిక రైతులతో కలిసి రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఆయనకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ప్రతికూల ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

మహబూబ్‌నగర్ : జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు పంటల సాగుపై నిరంతరం అవగాహన కల్పిస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సరైన సూచనలు, సలహాలు అందించాలని అన్నారు.

శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పులు, వర్షపాతం, పంటల సాగు, పంటల ప్రస్తుత పరిస్థితి తదితర అంశాలపై అదనపు కలెక్టర్ వెబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, ఇప్పటివరకు నమోదైన వర్షపాతం, మండలాల వారీగా వివిధ పంటల సాగు, పంటల ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితర వ్యవసాయ ఇన్‌పుట్‌ల లభ్యత, సరఫరా పరిస్థితిపై కూడా సమీక్షించారు.

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని



మధుసూదన్ నాయక్ సూచించారు. మండలాల వారీగా పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి, రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సలహాలను సకాలంలో అందించాలని ఆదేశించారు.

వాతావరణ మార్పులు, వాటి ప్రభావాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతుల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్‌లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సంరక్షణకు అవసరమైన చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వ్యవసాయ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద నాయక్, మండల వ్యవసాయ అధికారులు (హీూాం), వ్యవసాయ విస్తరణ అధికారులు (ూజూం), తదితరులు పాల్గొన్నారు.